• వరి పొలానికి ట్యాంకర్‌తో నీరు

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని గంట్లకుంట గ్రామంలో మాజీ సర్పంచ్ చింతల భాస్కర్‌రావు తన పంటను కాపాడుకొనేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. తనకున్న మూడెకరాల్లో వరి సాగు చేశాడు. బోరు బావిపై ఆధార పడి సాగు చేశాడు. పొలానికి నీరు సరిగా సరిపోక గురువారం జీపీ ట్యాంకర్ సహాయంతో నీటిని పట్టాడు. – పెద్దవంగర

• ఎండిన పొలాల్లో పశువుల మేత



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలో సాగుకు నీరందక పొలాలు నెరెలు బారుతున్నాయి. అన్నపూర్ణ రిజర్వాయర్ నీళ్లు రాక, అనంతారం చెరువు లోని కాలువ నీళ్లు ఊర చెరువులోకి పారక గ్రామంలోని పంటలు ఎండుతున్నాయి. దీంతో కడుపుమండిన రైతు ఉత్కం రాజయ్య ఎండిన తన పొలంలో పశువులను మేపాడు. –ఇల్లంతకుంట

కాళేశ్వరంతోనే సస్యశ్యామలం

మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేయాలి

- సాగుకు వెంటనే నీరందించాలి
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోతారంలో ఎండిపోయిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్, మార్చి 28: కాళేశ్వరంతోనే తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కొంతమంది సీనియర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తప్పు దోవ పట్టించారని, రైతులకు నీటి కష్టాలు తెచ్చిన పాపం వారిదేనని ఆయన మండిపడ్డారు. గురువారం సాయంత్రం జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోతారంలో ఎండిన పొలాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను పునరుద్ధరించాలని, మేడిగడ్డ పిల్లర్లను బాగుచేసి సాగునీరందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను విమర్శించడంమాని రైతులకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జగిత్యాల నియోజకవర్గంలో రైతులకు నష్టం జరుగుతున్నా, ఇక్కడి సీనియర్ నాయకులు ఎందుకు స్పందించడం లేదో? చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ పరిధిలో ఉన్న జగిత్యాల నియోజకవర్గంలో ఆయకట్టు పెరగడంతో 30 ఏండ్ల కిందటి నుంచే సాగు నీటి సమస్యలు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. కానీ బీఆర్ఎస్ సర్కారు కాళేశ్వరం ద్వారా నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టిందని చెప్పారు. కాంగ్రెస్ సర్కారు తీరుతో పంటలన్నీ ఎండిపోతున్నాయని అన్నారు. ఎస్సారెస్పీ స్టేజ్-1లోనే నీటి కొరత ఉంటే, మిగతా ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్సారెస్పీలో ఈ ప్రాంతానికి హక్కుగా రావాల్సిన నీటిని సూర్యాపేటకు తరలించుకుపోతున్నారని, అందుకే ఇక్కడ నీటి సమస్య ఏర్పడిందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు నష్టపోకుండా మరో తడికి నీటిని విడుదల చేయాలని కోరారు.

తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా వీరేంద్రశర్మ

హైదరాబాద్, మార్చి28 (నమస్తే తెలంగాణ) : తుంగభద్ర బోర్డు చైర్మన్‌గా బెంగుళూర్ సీడబ్ల్యూసీ మానిటరింగ్ ఆర్గనైజేషన్ వింగ్‌లో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వీరేంద్రశర్మ నియమితులయ్యారు. ఈ మేరకు తుంగభద్ర బోర్డు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు కృష్ణా బోర్డు మెంబర్ సెక్రటరీ డీఎం రాయపురే తుంగభద్ర బోర్డుకు ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరించారు.

సెస్‌ను కాపాడాలని మంత్రికి విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : 52 సంవత్సరాల చరిత్ర గల సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్)ను కాపాడాలని వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. గురువారం సచివాలయంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతితో కలిసి మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సెస్ గురించి మంత్రికి వివరించారు. 2,97,708 సభ్యులతో 2,55,830 కనెక్షన్లతో, సభ్యుల వాటా ధనం రూ. 6,14,81,587తో రాజన్న సిరిసిల్ల జిల్లాలో సెస్ సేవలందిస్తున్నదని తెలిపారు. సెస్‌కు సుమారు రూ. 500 కోట్ల ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని, అప్పుల్లో ఉన్నదనే వాదన సత్యదూరమని చెప్పారు. ఫిబ్రవరి నెలలో సెస్‌ను మూసివేయాలని లేక ఎన్‌డీపీసీఎల్‌లో విలీనం చేయాలని ఈఆర్‌సీ ప్రభుత్వానికి నివేదించిందని, విలీన నిర్ణయాన్ని విరమించుకొని సెస్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి నివేదికలు, వివిధ సంస్థలతో చర్చలు జరిపి తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పంటలు దక్కక యువ రైతు ఆత్మహత్య

శశికుమార్ (ఫైల్)

పాల్వంచ రూరల్, మార్చి 28: ఎనిమిదెకరాల్లో సాగు చేసిన పంటలు చేతికి రాక.. అందుకోసం చేసిన అప్పు తీర్చే మార్గం లేక ఓ యువ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వెలుగుచూసింది. పాల్వంచ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం యానంబైలు గ్రామానికి చెందిన ఎం శశికుమార్ (26) తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు. శశికుమార్ ఈ సీజన్‌లో ఎనిమిది ఎకరాల్లో పత్తి, వరి సాగు చేశాడు. పంటల నుంచి ఆశించినంత దిగుబడి రాకపోవడం, తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరగడంతో మంగళవారం సాయంత్రం ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శశికుమార్ గురువారం మరణించాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో మరో రైతు మృతి

గూడూరు, మార్చి 28: విద్యుత్తు మోటర్‌ను అమర్చబోయి కరెంట్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మధనాపురం గ్రామశివారు ధూపతండాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రైతు మాలోత్ లాలు(50)తన పొలంలో విద్యుత్తు తీగను సరి చేస్తుండగా షాక్‌కు గురై బావిలో ఉన్న మోటర్‌పై పడిపోయాడు.పక్కనున్న భార్య పద్మ గమనించి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల రైతులు వచ్చి బయటకు తీసి చూడగా అప్పటికే చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఒక కూతురికి నెల రోజుల్లో వివాహం జరగాల్సి ఉన్నదని బంధువుల తెలిపారు. లాలు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నగేష్ తెలిపారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కాసులపాడు శివారులో ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

రైతన్నను కాటేస్తున్న కాంగ్రెస్ సర్కార్

ఎమ్మెల్సీ మధుసూదనాచారి

చిట్యాల (మొగుళ్లపల్లి), మార్చి 28 : 'కాంగ్రెస్ దొంగ హామీలతో రైతులను ముంచి గద్దెనెక్కింది. సాగునీటి నిర్వహణలో ఘోరంగా విఫలమై రైతన్న పొట్టకొడుతున్నది' అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మండిపడ్డారు. సాగు నీరందక ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండలం కాసులపాడు గ్రామ శివారులో సాగునీరందక ఎండిపోయిన వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ఎకరం ఎండిపోకుండా నీరందించినట్టు కొనియాడారు. కానీ, కాంగ్రెస్ మూడు నెలల పాలనలో రైతులకు ముప్పుతిప్పలు తెచ్చిపెట్టిందని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ యంత్రాంగానికి యాసంగి పంటలకు నీరందించే సోయి లేదని విమర్శించారు. నష్టపోయిన రైతులు మనోధైర్యం కోల్పోవద్దని సూచించారు.

గోదావరిఖనిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

పంటలు ఎండుతున్నా పట్టని సర్కారు

- 30న పెద్దపల్లిలో 36 గంటల దీక్ష
- బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్

గోదావరిఖని, మార్చి 28: రైతు సమస్యలపై కాంగ్రెస్ సర్కార్ తీరును నిరసిస్తూ ఈ నెల 30న పెద్దపల్లిలో 36 గంటల నిరసన దీక్ష చేపడుతున్నట్టు నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.గురువారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కారు రైతుకేంద్రంగా పనిచేసిందని అన్నారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో చుక్కలు చూపించాలని అన్నారు.సీఎం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ రాష్ట్రాన్ని గాలికొదిలేశాడని దుయ్యబట్టారు.

'గ్రేడ్-1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లకు న్యాయం చేయండి'

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : రెండేండ్ల క్రితం ప్రారంభమైన నియామక ప్రక్రియలో భాగంగా శిశు సంక్షేమ శాఖలోని గ్రేడ్-1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'రెండేండ్ల క్రితం ప్రారంభమైన మహిళా శిశు సంక్షేమ శాఖలో గ్రేడ్-1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ల నియామక ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. చేయని నేరానికి వాళ్లను కోర్టుల చుట్టూ తిప్పుతుంది కాంగ్రెసు ప్రభుత్వం. దయచేసి వారికి న్యాయం చేయండి' అంటూ ట్వీట్ చేశారు. ట్వీట్‌ను @TSPSCofficial, @Telangana CSకు ట్యాగ్ చేశారు.

వానకాలానికి విత్తనాలు సిద్ధం చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ) : వానకాలంలో పంటల సాగుకు అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని అధికారులు, విత్తన కంపెనీలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం వానకాలం సాగు, విత్తనాల లభ్యతపై సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో రెండవ ప్రధాన పంటగా ఉన్న పత్తి వానకాలం దాదాపు 60.53 లక్షల ఎకరాలలో సాగయ్యే అవకాశం ఉందని, ఇందుకు 121.06 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరమని చెప్పారు. అలాగే వరి సాగుకు 16.50 లక్షల క్వింటాళ్లు, మొక్కజొన్న సాగుకు 48 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని తెలిపారు. రాష్ట్ర అవసరాలనే మొదటి ప్రాధాన్యతగా ప్రైవేట్ విత్తన కంపెనీలు గుర్తించి విత్తనాలు సరఫరా చేయాలని ఆదేశించారు.

కరువు మండలాలను ప్రకటించాలి

- రైతు స్వరాజ్య వేదిక డిమాండ్

హైదరాబాద్, మార్చి 28(నమస్తే తెలంగాణ): వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని రైతు స్వరాజ్య వేదిక ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఎంసీఆర్‌హెచ్ ఆర్డీ రూపొందించిన కరువు మాన్యువల్ ప్రకారం రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చట్టబద్ధతతో కూడిన రైతు కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

వరంగల్‌లో భారీ అగ్ని ప్రమాదం

- జకోటియా కాంప్లెక్స్‌లో మంటలు
- ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, రిలయన్స్ డిజిటల్‌లో ఆస్తినష్టం

పోచమ్మమైదాన్, మార్చి 28: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని జకోటియా కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి భారీ నష్టం చోటుచేసుకున్నది. మూడు అగ్నిమాపక వాహనాలతో ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. దీంతో పోచమ్మ మైదాన్ నుంచి కాశీబుగ్గ రహదారిలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. జకోటియా కాంప్లెక్స్‌లోని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో ఒకేసారి మంటలు లేచాయి. కార్యాలయంలోని కాగితాలు, కంప్యూటర్లు అంటుకొని మంటలు ఎగిసిపడ్డాయి. అందులో ఉన్న ఏసీలు, డెకోలమ్, థర్మకోల్ తదితర వస్తువులతో మంటలు మరింత చెలరేగాయి. మంటల తాకిడి తగ్గకపోగా కింది ఫ్లోర్‌లో ఉన్న రిలయన్స్ డిజిటల్‌లోకి వ్యాపించాయి. ఇందులో ఉన్న కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. దీంతో ఫైరింజన్ సిబ్బంది ఆర్పడానికి శత విధాలా ప్రయత్నం చేశారు. కాగా ఈ అగ్ని ప్రమాదంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన రూ.50 లక్షలకుపైగా ఆస్తినష్టం జరిగినట్టు తెలుస్తున్నది. సిబ్బంది అంతా అప్రమత్తమై బయటికి రావడంతో ప్రాణనష్టం తప్పింది. అలాగే రిలయన్స్ డిజిటల్‌కు సంబంధించి కూడా లక్షలాది రూపాయల నష్టం జరిగినట్టు సమాచారం. మాల్‌లోని వివిధ కార్యాలయాలు, షాపుల్లో ఉన్న కొనుగోలుదారులు ఆందోళనతో బయటకు పరుగులు తీశారు.

ఆస్తి కోసం అమానవీయం

- అనారోగ్యంతో వృద్ధురాలి మృతి
- వాటాల కోసం బంధువుల వీరంగం
- 36 గంటల తర్వాత అంత్యక్రియలు
- కామారెడ్డి జిల్లా ఇసన్నపల్లిలో ఘటన

రామారెడ్డి, మార్చి 28: వారసులు లేని వృద్ధురాలు మరణిస్తే బంధువులు ఆస్తి కోసం దాడులు చేసుకున్నారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం ఇసన్నపల్లిలో ఈ ఘటన జరిగింది.పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఇసన్నపల్లికి చెందిన చింతల కిష్టవ్వ (55)కు వారసులు లేరు. ఆమెకు గ్రామంలో 40 గుంటల భూమి, ఇల్లు ఉన్నది. అనారోగ్యంతో ఉన్న కిష్టవ్వ బుధవారం చనిపోయింది. అయితే, దహన సంస్కారాలు నిర్వహించాల్సిన బంధువులు ఆస్తి కోసం తగువులాటకు దిగారు. కిష్టవ్వ తామే సపర్యలు చేశామని, అంత్యక్రియలు తామే చేస్తామని ఆమె చెల్లెలి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. తమకు రూ.2 లక్షలు ఇస్తేనే దహన సంస్కారాలు చేయనిస్తామని కిష్టవ్వ మరిది మైసయ్య కుటుంబీకులు పట్టుబట్టారు. గురువారం ఉదయం మొదలైన ఈ గొడవ ఉద్రిక్తతతకు దారి తీసింది. ఈ క్రమంలో మైసయ్య కుమారుడు రవీందర్ తల్వార్ తీసుకొచ్చి.. మృతురాలి చెల్లెలి కొడుకు అయిన రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన అప్పరబోయిన నర్సింహులుపై దాడి చేశాడు. ఈ దాడి నుంచి తప్పించుకునే క్రమంలో నర్సింహులు చేతి మూడు వేళ్లు తెగిపోయాయి. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ఆస్తుల గొడవ తర్వాత చూసుకోవచ్చని, ముందు అంత్యక్రియలు జరిపించాలని పోలీసులు, కులస్థులు సర్దిచెప్పడంతో ఇరువర్గాల వారు శాంతించారు. చివరకు గురువారం రాత్రి కిష్టవ్వ దహన సంస్కారాలు పూర్తి చేశారు.

తాళ్లతో బంధించి.. ఒంటిపై వేడి నీళ్లు పోసి

- భర్తను దారుణంగా హతమార్చిన భార్య
- కన్నతల్లి ఎదుటే కిరాతకం

హేమంత్ (ఫైల్)

రాంనగర్, మార్చి 28: కరీంనగర్‌లో గురువారం దారుణం జరిగింది. ఓ గృహిణి భర్తను తాళ్లతో కట్టి కారం పొడి, వేడి నీళ్లు ఒంటిపై పోసి రోకలి బండతో బాది దారుణంగా హతమార్చింది. కన్నతల్లి ఎదుటే ఈ కిరాతకానికి ఒడిగట్టింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన తోట హేమంత్‌కు రోహితితో 2012లో వివాహం జరిగింది. హేమంత్ (39) పెట్రోల్ బంక్‌లో పనిచేసి కొంతకాలం క్రితం మానేశాడు. రోహితి ప్రభుత్వ దవాఖానలో కాంట్రాక్టు పద్ధతిలో పేషెంట్ కేర్‌గా పనిచేస్తున్నది. వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నా యి. గురువారం రోహిణి ఓ ఇద్దరితో కలిసి ఇంటికి వచ్చింది. తలుపులు పెట్టి హేమంత్‌ను ఇంట్లో తాళ్ల తో కట్టేశారు. కారం పొడి పోసి చితకబాదారు. కొంతసేపటి తర్వాత ఆ ఇద్దరు వెళ్లిపోగా రోహితి వేడి నీళ్లు ఒంటిపై పోసి రోకలి బండతో తలపై బాదడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. మర్మాంగంపై గాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. చికిత్స కోసం అంబులెన్సులో దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించాడు. తల్లి విమల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్వార్‌తో దాడి చేస్తున్న రవీందర్

షోకాజ్ నాకు కాదు.. రేవంత్‌కివ్వాలి

- బడేభాయ్ అంటే ఎవరికి లాభం..? బీజేపీకా? కాంగ్రెస్‌కా?
- రాహుల్, సోనియాను కష్టపెట్టిన మోదీ ఎట్ల బడేభాయ్?
- కాంగ్రెస్‌ను ఓడించిన వారే అభ్యర్థులా?
- రాష్ట్రంలో బీజేపీని గెలిపించే కుట్ర?
- సిమ్‌కార్డుల కొనుగోలు బయటపెట్టినందుకే షోకాజ్
- 'నమస్తే తెలంగాణ'తో బక్క జడ్సన్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ బ్యాంక్ అకౌంట్లు సీజ్ చేసి, సోనియా, రాహుల్ గాంధీని ఇబ్బందిపెట్టిన ప్రధాని మోదీ సీఎం రేవంత్‌రెడ్డికి బడేభాయ్ ఎట్ల అయితడు? అని కాంగ్రెస్ సీనియర్ నేత, ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్ ప్రశ్నించారు. దీనిని బట్టి షోకాజ్ నోటీసు ఇవ్వాల్సింది ఎవరికో క్రమశిక్షణ కమిటీ ఆలోచించాలని అన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అభియోగంపై షోకాజ్ నోటీసు అందుకున్న బక్క జడ్సన్ 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో తన ఆవేదన పంచుకున్నారు. ప్రధాని మోదీని బడేభాయ్ అని పొగడటం కాకుండా.. విభజన హామీలను ఎందుకు నెరవేర్చలేదు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీజిపేట కోచ్ ఫ్యాక్టరీ ఏమయ్యాయి? తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి నిలదీసి ఉంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మేవారని అన్నారు. అలా కాకుండా తెలంగాణకు మొండి చేయి చూపిన మోదీని బడేభాయ్ అని అంటే ఎవరికి లాభం బీజేపీకా? కాంగ్రెస్కా? అని నిలదీశారు. తెలంగాణ ప్రజలు గత ప్రభుత్వాన్ని గద్దె దింపి, కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే, గత ప్రభుత్వంలో అధికారం చెలాయించిన వారిని కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకుంటారని ఒక సగటు కార్యకర్తగా ప్రశ్నించడం తప్పా అని జడ్సన్ ఆవేదన వ్యక్తంచేశారు. తనపై ఫిర్యాదు చేసింది ఎవరో నోటీస్‌లో వారి పేర్లు ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. గత 34 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న నిఖార్సైన కార్యకర్తనని, ఏఐసీసీ సభ్యునిగా, జార్ఖండ్ రాష్ట్ర ఇన్‌చార్జిగా, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా కీలక పదవులు నిర్వహించానని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు అయిన తర్వాత పార్టీలో తనకున్న పదవులన్నింటి నుంచి తొలగించారని ఆరోపించారు. కాంగ్రెస్ సిద్ధాంతానికి పూర్తి విరుద్ధమైన సిద్ధాంతం కలిగిన బీజేపీ నాయకులను రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడం తప్పు అయితదా? లేక తాను మాట్లాడింది తప్పు అయితదా? అని నిలదీశారు.

బీజేపీని గెలిపించే కుట్ర జరుగుతున్నదా?

గతంలో కాంగ్రెస్‌ను తిట్టిన వారికి, పార్టీ అభ్యర్థులను ఓడించిన వారికి ఎంపీ టికెట్లు ఇస్తున్నారని బక్క జడ్సన్ ఆరోపించారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక హిందీ టీవీ చానల్ చర్చలో రాహుల్‌గాంధీని నోటికొచ్చినట్టు తిట్టాడని, అతనికి భువనగిరి టికెట్ ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి, పటాన్‌చెరు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణమైన నీలం మధుకు మెదక్ టికెట్ ఇచ్చారని చెప్పారు. దీని ద్వారా పార్టీ శ్రేణులకు ఏం సందేశం ఇస్తున్నామని జడ్సన్ ప్రశ్నించారు. చేవెళ్ల, మల్కాజిగిరి, భువనగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎంపిక చేసిన వారిని చూస్తే, అక్కడ బీజేపీ అభ్యర్థులను గెలిపించే కుట్ర జరుగుతున్నదా? అన్న అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు.

సీఎం పక్కన ఉన్నోళ్లే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారు

సీఎం రేవంత్‌రెడ్డి పక్కన ఉన్నోళ్లే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని బక్క జడ్సన్ ఆరోపించారు. నాలుగు లక్షల సిమ్ కార్డుల కొనుగోళ్ల వెనుక సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారని చెప్పారు. విద్యాసాగర్‌రెడ్డి అనే వ్యక్తి నాలుగు లక్షల సిమ్ కార్డులు కొన్నారని నగర సీపీకి ఫిర్యాదు చేయగానే, షోకాజ్ నోటీసు ఇచ్చారని ఆరోపించారు. ఇది ఎక్కడ తలకు చుట్టుకుంటుందోనన్న భయంతోనే సీఎం తనకు షోకాజ్ నోటీసు ఇప్పించారని జడ్సన్ విమర్శించారు.

చేతి పంపు కొట్టి.. దాహం తీర్చుకొని



మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కమలాపూర్ సమీపంలోని ఏనుగుల క్యాంప్‌లోని రూప అనే ఏనుగు తన దాహం తీర్చుకునేందుకు గురువారం స్థానికంగా ఉన్న చేతిపంపును ఆశ్రయించింది. తొండంతో చేతి పంపు హ్యాండిల్‌ను కొడుతూ.. నీరు తాగింది. వేసవిలో అడవిలో చుట్టుపక్కల నీటి వనరులు ఎండిపోయినప్పుడు ఈ ఏనుగు ఇలా చేస్తుందని క్యాంప్ నిర్వాహకులు చెబుతున్నారు. దీన్ని క్యాంప్ నిర్వాహకులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరల్ అయ్యింది. – కోటపల్లి

సాగర్‌పై సర్కారు చేతులెత్తేసిందా..?

- ఓఅండ్ఎం పనుల స్వాధీనానికి ఏపీ తీవ్రయత్నాలు
- కేంద్ర జల్‌శక్తి ఆర్డర్‌ను ఊటంకిస్తూ కేఆర్ఎంబీకి లేఖ
- పనులు అప్పగించాలని బోర్డుపై ఆంధ్రప్రదేశ్ ఒత్తిడి
- అసెంబ్లీ తీర్మానం తరువాత తెలంగాణ సర్కారు గప్‌చుప్

హైదరాబాద్, మార్చి28 (నమస్తే తెలంగాణ) : నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందా ? ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించబోమని అసెంబ్లీ వేదికగా తీర్మానం చేసినా.. ఇప్పటివరకు మళ్లీ ఆ అంశంపై స్పందించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రాజెక్టుపై పట్టు కోసం ఏపీ తీవ్రంగా యత్నిస్తున్నది. కేంద్ర జల్‌శక్తిశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను అదునుగా తీసుకుని ప్రాజెక్టు ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ పనులను స్వాధీనం చేసుకోవాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. తెలంగాణ పనులు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఏపీ, తాజాగా ఆ పనులు తామే నిర్వహించుకుంటామని బోర్డుకు లేఖ రాయడం ఏపీ ప్రయత్నాలకు ఉదాహరణగా నిలుస్తున్నది.

ఏపీ సర్కారు దూకుడు

నాగార్జునసాగర్ డ్యామ్ నిర్వహణ తెలంగాణ, శ్రీశైలం డ్యామ్ నిర్వహణ, మెయింటనెన్స్‌ను ఏపీ సర్కారు చూడాల్సి ఉంది. రాష్ట్ర పునర్విభజన నాటి నుంచీ ఇదే విధానం కొనసాగుతున్నది. నాగార్జునసాగర్ డ్యామ్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.20 కోట్లతో మరమ్మతులు చేపట్టింది. ప్రధానంగా గేట్ల రబ్బర్‌సీల్స్‌ను మార్చడం, గ్రీజింగ్, రోప్‌ల మార్పిడితోపాటు, గ్యాంట్రీ పట్టాల మార్పిడి, గ్యాలరీ తదితర పనులు కొంతకాలంగా నిర్వహిస్తున్నది. ఇదిలా ఉండగా ఏపీ సర్కారు అక్రమంగా డ్యామ్‌కు కుడివైపు 13వ గేట్‌వరకు, కుడికాలువ రెగ్యులేటర్‌ను ఆక్రమించడం, అటు తరువాత కేంద్రం జోక్యం చేసుకుని సీఆర్పీఎఫ